RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 102 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 14.10.2026 | పేజీలు : 8

సింహాలతో సీతక్క సవారీ..

దక్షిణాఫ్రికాలో సఫారీ వీడియో వైరల్

- దక్షిణాఫ్రికా పర్యటనలో మంత్రి సీతక్క
- సింహాల సఫారీలో వాటి వెంటే ధైర్యంగా నడిచిన దృశ్యాలు
- సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న వీడియో
- ఆమె ధైర్యాన్ని కొనియాడుతున్న నెటిజన్లు
- ఆదివాసీ నేపథ్యమే దీనికి కారణమంటూ ప్రశంసల వెల్లువ

2



హైదరాబాద్ నీటి సరఫరాపై వదంతులు..

క్లారిటీ ఇచ్చిన జలమండలి

- హైదరాబాద్‌లో నీటి కొరతపై వైరల్ అవుతున్న సందేశం అవాస్తవమన్న జలమండలి
- జలమండలి పేరుతో వాట్సాప్, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- తాము ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని బోర్డు స్పష్టీకరణ
- ఎన్నినో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతాయన్నది వదంతే..
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచన

2

రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్..

- ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్రేనని ఆరోపణ

- రైతు డిస్కమ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం జీవో 17 జారీ
- ఇది ఉచిత విద్యుత్‌ను నీరుగార్చే కుట్రేనని ఆరోపించిన హరీశ్ రావు
- జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- సౌర, జల విద్యుత్‌పై ఆధారపడి 24 గంటల కరెంట్ ఎలా సాధ్యమని ప్రశ్న
- కొత్త డిస్కమ్‌పై అప్పుల భారం మోపడంపై ఆందోళన



నేటి శుభోదయ, హైదరాబాద్: తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. ఇది వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దూరం చేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు విద్యుత్ రంగ నిపుణులు, రైతుల అభ్యంతరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ విమర్శించారు....

2

డబుల్ డెక్కర్ కారిడార్ కు ఆమోదం..!!

హైదరాబాద్ కు కేంద్రం గుడ్ న్యూస్

ఎల్బీనగర్ - హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపనకు గడ్కరీ గ్రీన్ సిగ్నల్

పర్వతమాల కింద రాష్ట్రానికి 5 కొత్త రోప్‌వేలు, 3 ఆర్వోబీలు

హైదరాబాద్ - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశం



నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : హైదరాబాద్ కు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. దిల్లీలో కేంద్రమంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై భేటీలో కీలక అంశాల పైన చర్చించారు. ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రమంత్రి అంగీకారం తెలిపారు. తెలంగాణలో కీలక మౌలిక వసతులు.. ప్రాజెక్టుల పై కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. నవంబర్ 19–22 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇండియన్ రోడ్ కాంగ్రెస్' (IRC) సదస్సుకు హాజరు కావాలని కేంద్ర మంత్రి గారిని ఆహ్వానించగా, వారు తప్పక వస్తానని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ – హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు .....

2

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా గంజాయి పట్టివేత
- గీజర్‌లో దాచి తరలిస్తున్న 7.750 కిలోల గంజాయి సీజ్
- పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 2.71 కోట్లు అని అంచనా ప్రజలకు భరోసా.
- బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి అరెస్ట్



2

ఆమ్రపాలి క్యాడర్ వివాదం..

హైకోర్టులో తీర్పు రిజర్వ్

- ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్
- తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని గతంలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలు
- క్యాట్ తీర్పుపై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేసిన ఆమ్రపాలి
- ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి



2

నిరసనకారులను విడదీసే కుట్ర..

కేంద్రంపై అభిజిత్ దీపేక్ తీవ్ర ఆరోపణలు

- నిరసనల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపణ
- ఉద్యమకారుల మధ్య అనుమానాలు సృష్టించి విడదీసే ప్రయత్నం
- తమ నిరసనపై ఉక్కుపాదం, ఇండియా కూటమి ర్యాలీకి అనుమతిపై విమర్శ
- కుట్ర సిద్ధాంతాలను నమ్మకుండా ఐక్యంగా ఉండాలని ఉద్యమకారుల పిలుపు



2

రాహుల్ గాంధీ నన్ను తోసేశారు : గర్భిణీ జర్నలిస్ట్ సంచలన ఆరోపణ

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడు నెలల గర్భిణి రిచా పరాశర్
- ఇది బీజేపీ ప్రచారమంటూ ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్
- రాహుల్‌పై మండిపడిన బీజేపీ నేతలు

నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఒక మహిళా జర్నలిస్ట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ తన చేయి పట్టుకుని లాగి, తోసేశారని ఆమె ఆరోపించారు. మూడు నెలల గర్భిణి అయిన జర్నలిస్ట్ రిచా పరాశర్ ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చేరారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా బీజేపీ చేస్తున్న దుష్ప్రచారం అని కొట్టిపారేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ .....



2

విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర : కిషన్ రెడ్డి

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి



2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ నీటి సరఫరాపై వదంతులు..
క్లారిటీ ఇచ్చిన జలమండలి

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ నగరంలో నీటి సరఫరాపై వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తమ పేరుతో ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని హైదరాబాద్ జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ఎన్నినో ప్రభావం, కరవు పరిస్థితుల కారణంగా నవంబర్ చివరి నాటికి హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే జలాశయాలు ఎండిపోతాయని, దీంతో నగరంలో నీటి సరఫరాను నిలిపివేస్తారని లేదా తీవ్ర ఆంక్షలు విధిస్తారని ఒక మెసేజ్ కొద్ది రోజులుగా వైరల్ అవుతోంది. ఈ సందేశం జలమండలి జారీ చేసినట్టుగా ఉండటంతో నగరవాసుల్లో ఆందోళన మొదలైంది. ఈ ప్రచారంపై స్పందించిన జల మండలి అధికారులు, తాము అలాంటి హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదని స్పష్టం చేశారు. వైరల్ మెసేజ్‌లో పేర్కొన్న జలాశయాల నీటిమట్టాలు, సరఫరా పరిస్థితులకు సంబంధించిన సమాచారం అధికారికం కాదని తెలిపారు. తమ సంస్థ పేరుతో వచ్చే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీటి సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమాచారం కోసమైనా బోర్డు అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ. 2.71 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పక్కా సమాచారం అందుకున్న డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని అడ్డగించారు. అతని చెక్-ఇన్ బ్యాగేజీని తనిఖీ చేయగా, అందులో ఒక ఎలక్ట్రిక్ గీజర్ కనిపించింది. అనుమానంతో దాన్ని తెరిచి చూడగా, లోపల 73 ప్యాకెట్లలో పచ్చని పదార్థం బయటపడింది. నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయి అని నిర్ధారణ అయింది. దీంతో అధికారులు వెంటనే సదరు ప్రయాణికుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్, 1985 ప్రకారం అరెస్ట్ చేశారు. సరుకును మొత్తం సీజ్ చేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్‌కు అధిక నాణ్యత గల గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా ఈ పట్టివేత జరిగిందని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నందున నిందితుడి వివరాలను ఇంకా వెల్లడించలేదు.

ఆమ్రపాలి క్యాడర్ వివాదం..
హైకోర్టులో తీర్పు రిజర్వ్

మొదటిపేజీ తరువాయి.. సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నిరసనకారులను విడదీసే కుట్ర..
కేంద్రంపై అభిజిత్ దీపేక్ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి.. కేంద్ర ప్రభుత్వం నిరసనకారుల మధ్య విభేదాలు సృష్టించి, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు 'విభజించి పాలించు' అనే కుట్రపూరిత వ్యూహాన్ని అమలు చేస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీపేక్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు, వివిధ నిరసన బృందాల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ వారి మధ్య అపనమ్మకాన్ని, అనుమానాలను రేకెత్తిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో సీజేపీ నిరసనకు అనుమతి లభించినప్పుడు, కొందరు తమను బీజేపీ అనుకూల వ్యక్తులుగా చిత్రీకరిస్తూ కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. నిన్న ఇండియా కూటమి భారీ నిరసన చేపట్టిన నేపథ్యంలో, అక్టోబర్ 10న తమపై ప్రయోగించిన ఉక్కుపాదాన్ని ప్రభుత్వం వారిపై ప్రయోగించలేదని ఆయన వివరించారు. "ప్రజలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పడమే ఈ ప్రభుత్వ విధానం. ఒక నిరసనను అనుమతించి, మరొకదాన్ని అణిచివేయడం ద్వారా ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్న వర్గాల మధ్య అనుమానాలకు ఆస్కారం కల్పిస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రపూరిత వ్యూహం వెనుక ఉన్న అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలని అభిజిత్ దీపేక్ కోరారు. "నేడు ఒకరికి అనుమతినిచ్చి, మరొకరిని అణిచివేస్తే ప్రభుత్వం, రేపు దానికి భిన్నంగా వ్యవహరించవచ్చు. అధికారాన్ని ప్రశ్నించడం మానేసి, నిరసనకారులు తమలో తామే కలహించుకునేలా చేయడమే పాలకుల అంతిమ లక్ష్యం" అని ఆయన విశ్లేషించారు. తప్పుడు ప్రచారాలను, కుట్ర సిద్ధాంతాలను నమ్మి విడిపోవద్దని, అంతర్గత విభేదాల ఉచ్చులో పడవద్దని ఆయన ప్రజలకు, వివిధ నిరసన బృందాలకు విజ్ఞప్తి చేశారు. "మనమంతా ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. మన పోరాటం జ్ఞానేశ్ కుమార్ నియామకంపై, ఆయనను వెనకేసుకొస్తున్న వ్యవస్థపైనే అన్న విషయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు.

రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్..
- ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్రేనని ఆరోపణ

మొదటిపేజీ తరువాయి.. "రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, అన్నదాత మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర?" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ జీవో ప్రకారం 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 ఎత్తిపోతల పథకాలతో పాటు HMWSSB, మిషన్ భగీరథ కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను కొత్త డిస్కమ్‌కు బదిలీ చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు కేవలం 25 శాతం థర్మల్ విద్యుత్‌ను కేటాయించి, 58 శాతం సౌర, మిగిలింది జల విద్యుత్‌పై ఆధారపడటం అవివేకమన్నారు. సౌర విద్యుత్ పగలు మాత్రమే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఏడాదిలో మూడు, నాలుగు నెలలే లభిస్తుందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ఎలా సాధ్యమవుతుందని సందేహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే సంస్థపై అప్పులు, బకాయిల భారం మోపడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొత్త సంస్థలను ఏర్పాటు చేస్తే రైతుల కరెంట్ కష్టాలు తీరవని, వెంటనే జీవో 17ను వెనక్కి తీసుకుని, ఉచిత విద్యుత్ కొనసాగింపుపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సింహాలతో సీతక్క సవారీ..
దక్షిణాఫ్రికాలో సఫారీ వీడియో వైరల్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ మంత్రి సీతక్క ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఆమె దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సింహాల సఫారీకి వెళ్లగా, అక్కడ సింహాల వెంటే ఎంతో ధైర్యంగా నడుస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఆమె సాహసాన్ని చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మంత్రి సీతక్క ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించారు. అక్కడి తెలంగాణ సంఘం ఆహ్వానం మేరకు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. దీంతో పాటు, ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి కూడా ఈ పర్యటనను ఉపయోగించుకున్నారు. తన అధికారిక పర్యటనలో భాగంగా ఆమె ఓ లయన్ సఫారీని సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని సింహాలు వారు ప్రయాణిస్తున్న వాహనం వద్దకు రావడం, ఆ తర్వాత సీతక్క చేతిలో ఓ కర్ర పట్టుకుని రెండు సింహాల వెనుక ఎంతో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ కనిపించడం వంటి దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ క్లిప్‌ను ఆమె తన సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది మరింత వేగంగా వ్యాపించింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు మంత్రి సీతక్క ధైర్యాన్ని కొనియాడుతున్నారు. ఆమె ఆదివాసీ నేపథ్యం, రాజకీయాల్లోకి రాకముందు నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన గతం వంటి అంశాలను గుర్తుచేసుకుంటూ, ఆ ధైర్యమే ఇక్కడ కనిపిస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు అడవుల్లో పోరాడిన ఆమె, ఇప్పుడు సింహాల మధ్య కూడా అంతే ధైర్యంగా నడవడంలో ఆశ్చర్యం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నత చదువులు (పీహెచ్‌డీ, లా) చదివి, ప్రజా జీవితంలోకి వచ్చిన ఆమె ప్రస్థానాన్ని అభినందిస్తున్నారు.

రాహుల్ గాంధీ నన్ను తోసేశారు
: గర్భిణీ జర్నలిస్ట్ సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి.. రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న ఇండియా కూటమి నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ నుంచి సౌండ్‌బైట్ తీసుకునేందుకు ప్రయత్నించానని రిచా తెలిపారు. ఆ సమయంలో రాహుల్ తన చేయి పట్టుకుని దూకుడుగా లాగారని, వెంటనే ఆయన బాడీగార్డులు కూడా తోసేయడంతో మెట్లపై పడిపోయానని ఆమె వాపోయారు. తన కెమెరామెన్‌ను కూడా తోయడంతో అతను తనపై పడ్డాడని వివరించారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. పలువురు నేతలు ఆసుపత్రికి వెళ్లి రిచాను పరామర్శించారు. రాహుల్ తీరుపై కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి మండిపడ్డారు. మరోవైపు, కాంగ్రెస్ నేత అల్కా లాంబా ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. జర్నలిస్ట్ ఆసుపత్రిలో చేరిన సమయం, గర్భవతిగా ఉన్నప్పుడు ఎక్స్‌రే తీయడం వంటి అంశాలపై ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. ఇది బీజేపీ ఆడిస్తున్న నాటకమని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి

విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర : కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

డబుల్ డెక్కర్ కారిడార్ కు ఆమోదం
- హైదరాబాద్ కు కేంద్రం గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి.. ఆమోదం తెలిపిన గడ్కరీ మరి కొన్ని అంశాలకు అంగీకరించారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో NH 167kపై తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు అనుసంధానం జరిగితే, రవాణా వ్యవస్థ, పర్యాటకం మెరుగుపడ నుందని కోమటిరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ – శ్రీశైలం NH 765పై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంపై నూతన డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రమంత్రి ఆదేశించారు.

గడ్కరీతో కోమటిరెడ్డి చర్చల ఫలితం

అదే విధంగా పర్వతమాల పథకం ద్వారా తెలంగాణకు 5 రోప్‌వేలకు నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. హైదరాబాద్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్ఓబీలకు నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. తెలంగాణలో 34 పనులకు సీఆర్ఐఎఫ్ (CRIF) నిధులను మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరగా కేంద్ర అధికారులను నితిన్ గడ్కరీ ఆదేశించారు. పుల్లూరు – అలంపూర్ – జట్రపోలు – పెంట్లవెల్లి – కొల్లాపూర్ – లింగాల – అచ్చంపేట – డిండి – దేవరకొండ – మల్లేపల్లి – నల్గొండ రాష్ట్ర హైవేలను జాతీయ హైవేలుగా మార్చాలని కోమటిరెడ్డి కోరడంతో సానుకూలంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఉద్యమకారుల హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో ఉద్యమం

- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలి
- వరంగల్ చౌరస్తాలో చెవిలో పువ్వులు పెట్టుకొని ఉద్యమకారుల నిరసన



వరంగల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి హెచ్చరించారు. మంగళవారం వరంగల్ చౌరస్తాలో ఉద్యమకారులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది ఉద్యమకారులు తమ సంపాదనను కోల్పోయి, కుటుంబాలను సైతం పక్కనపెట్టి ఉద్యమమే లక్ష్యంగా పోరాడారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా వారి బతుకులు దయనీయంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపినవారు, రిమాండ్‌కు వెళ్లినవారు, బైండోవర్ కేసులను ఎదుర్కొన్నవారికి 250 గజాల ఇంటి స్థలం, ప్రతినెల రూ.25 వేల పింఛను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏ విధంగా పోరాడామో, అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా "రేవంత్ రెడ్డి డౌన్ డౌన్", "కేశవరెడ్డి కమిటీ డౌన్ డౌన్", "ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి" అంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మేకల ఎల్లయ్య, శంకేసి లింగమూర్తి, నాగవెల్లి సాంబయ్య, మట్టెడ కరుణాకర్, కెంచ ఆనంద్, భూంపల్లి జయశంకర్, ఆవునూరు లక్ష్మి , ఆడెపు రాధిక, ఐత ప్రభాకర్, పరికిపండ్ల ఈశ్వరయ్య, మాడిశెట్టి రాజ్‌కుమార్, వసం కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, ఇమ్మడి వీరస్వామి, పంగి విశ్వేశ్వరరావు, బస్కే రంజిత్, బోగోజు లక్ష్మణమూర్తి, మడిపోజు సంజీవ చారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు దాస్యం వినయ్ భాస్కర్ సంఘీభావం

- సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి



హన్మకొండ, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం సంఘీభావం తెలిపారు. హన్మకొండ కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగుల వద్దకు చేరుకున్న ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని వినయ్ భాస్కర్ హామీ ఇచ్చారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు సంతోషంగా, గౌరవప్రదంగా విధులు నిర్వహించారని పేర్కొంటూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఉద్యోగులు కోరుతున్న సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యోగులు పాల్గొని తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ కోతలపై సబ్‌స్టేషన్ల ముట్టడికి సిద్ధం కావాలి

- రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలిమాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు



ములుగు జిల్లా/ తాడ్వాయి, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యుత్ కోతలను నిరసిస్తూ తాడ్వాయి మండలం పరిధిలోని కాటాపురం గ్రామ సబ్‌స్టేషన్‌ను ముట్టడించేందుకు రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచనలతో, ములుగు జిల్లా పార్టీ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపుతో బుధవారం ములుగు జిల్లా వ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు తప్పవని నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిజం చేసి చూపిస్తోందని ఆరోపించారు. రైతుల కష్టాలను తీర్చలేని ప్రభుత్వానికి విద్యుత్ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం, ప్రజాపాలన అని చెప్పుకోవడం కాకుండా ఆచరణలో ప్రజలకు మేలు జరిగేలా పాలన సాగించాలని హితవు పలికారు.ములుగు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు మల్లంపల్లిని మండలంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు భూగర్భ జలాలను వినియోగించుకునేందుకు కూడా విద్యుత్ సమస్యలు అడ్డంకిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వేసి నప్పటి నుంచి ధాన్యం విక్రయించే వరకు రైతులు అనేక ఇబ్బందులు, మోసాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణి ద్వారా అర్హులైన వారికి పట్టాలు అందించిందని, పోడు భూములకు సైతం పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూభారతి, 22-ఏ నిబంధనల పేరుతో పేదల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చడానికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, కూల్చడం తప్ప నిర్మించడం తెలియదంటూ విమర్శించారు.రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించనున్న సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమంతోనే ఆగబోమని, రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యమాలు తమ పార్టీకి కొత్త కాదని, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు.. పట్టించుకోని అధికారులు!

- ఏడాదిగా విన్నవిస్తున్నా స్పందన కరువుస్తంభాల అడ్డంకితో డ్రైనేజీలో చెత్త నిల్వ.. గత వర్షాకాలంలో మునిగిన కాలనీ





వరంగల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగసాయిపేట 42వ డివిజన్ నందికుంట కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ స్తంభాలను తొలగించాలని గత ఏడాది నుంచి విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ఒక విద్యుత్ స్తంభం రాకపోకలకు ఇబ్బందిగా మారగా, మరో స్తంభం డ్రైనేజీ మార్గంలోని చెత్త, వ్యర్థాలు సాఫీగా వెళ్లేందుకు అడ్డంకిగా ఉందని స్థానికులు చెబుతున్నారు. స్తంభం కారణంగా మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు ముందుకు వెళ్లడం లేదని, దీంతో గత వర్షాకాలంలో కాలనీ నీట మునిగిందని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ డీఈ, ఏఈలు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు. ప్రజల భద్రత, కాలనీ సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి స్పందించాలని 42వ డివిజన్ అధ్యక్షుడు, కార్పొరేటర్‌గా పోటీ చేసిన దామర కొండ కరుణాకర్‌తో పాటు కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని, వర్షాకాలంలో మరోసారి కాలనీ ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

దొందూ దొందే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరు ఒక్కటే!

- మాటలు కోటలు దాటుతున్నా.. చేతల్లో కనిపించని మార్కెట్ పనులు
- మంథనిలో నూతన మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారు?
- వచ్చే ఎన్నికల్లో మంథని గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం: బీజేపీ నాయకుల ధీమా



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథనిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలన తీరు ఒకే విధంగా ఉందని, హామీలు ఇవ్వడంలో ముందుంటూ అభివృద్ధి పనుల పూర్తి విషయంలో వెనుకబడుతున్నాయని బీజేపీ మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి సామల అశోక్‌కుమార్ విమర్శించారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

మార్కెట్ నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారు?

మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ పట్టణంలో శాఖాహార, మాంసాహార మార్కెట్ల నిర్మాణం ప్రకటనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఒక నెల శంకుస్థాపన, మరో నెల బోరు పనులు, ఆ తర్వాత పనులు ప్రారంభించినట్లు ప్రకటనలు చేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడేలా మార్కెట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంలో పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు. ప్రజలకు ఎంతో అవసరమైన నూతన మార్కెట్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని ప్రశ్నించారు. పనులు పూర్తి చేసి వ్యాపారులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారా? లేక ఆ స్థలాన్ని మరేదైనా అవసరానికి వినియోగిస్తారా? అని నిలదీశారు. కేవలం ప్రకటనలతో ప్రజల అవసరాలు తీరవని, అభివృద్ధి పనులు పూర్తయినప్పుడే పాలకుల చిత్తశుద్ధి తెలుస్తుందని పేర్కొన్నారు.

హామీలు కాదు.. అభివృద్ధి చేతల్లో చూపించాలి

మంథని ప్రజలకు రాజకీయ ప్రసంగాలు, హామీల కంటే పూర్తయిన అభివృద్ధి పనులే ముఖ్యమని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. శాఖాహార, మాంసాహార మార్కెట్ల నిర్మాణంపై పాలకులు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారని హెచ్చరించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

రానున్న ఎన్నికల్లో మంథని గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని సబ్బని సంతోష్, సామల అశోక్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా హామీలతో కాలయాపన చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రకటనలకు పరిమితం కాకుండా శాఖాహార, మాంసాహార మార్కెట్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌కు తరలిరండి

- ‘మన జిల్లా – మన రామగిరి ఖిల్లా’ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అక్టోబర్ 18న ఉదయం 6 గంటలకు బేగంపేట నుంచి ప్రారంభం
- అడవి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం



పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలోని చారిత్రక రామగిరి ఖిల్లా విశిష్టతను, దాని చరిత్రను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు ప్రకృతి అందాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ‘మన జిల్లా – మన రామగిరి ఖిల్లా’ పేరుతో నడక, పర్వతారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ‘మన జిల్లా – మన రామగిరి ఖిల్లా’ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. రామగిరి ఖిల్లాకు చేరుకుని అక్కడి అడవి అందాలను వీక్షించడంతో పాటు చారిత్రక విశేషాలను తెలుసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

పేర్ల నమోదు తప్పనిసరి

ట్రెక్కింగ్‌లో పాల్గొనాలనుకునే వారు పోస్టర్‌పై ఉన్న సంకేత చిత్రాన్ని (క్యూఆర్ కోడ్) స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి ఒడిలో నడుస్తూ రామగిరి ఖిల్లా గొప్పతనాన్ని తెలుసుకునే ఈ కార్యక్రమం ప్రజలకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని తెలిపారు.

అడవి, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ట్రెక్కింగ్ సమయంలో అడవిలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్ష సంపదకు ఎలాంటి హాని కలిగించకూడదని కలెక్టర్ సూచించారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూనే మన పూర్వీకులు అందించిన చారిత్రక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్‌రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి, పెద్దపల్లి యువశక్తి సామాజిక మాధ్యమాల ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవుల పట్టివేత

- రెండు చిన్న ట్రాలీల్లో కరీంనగర్‌కు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని పట్టణంలోని కూచిరాజ్‌పల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీల్లో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీల్లో కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మంథని పట్టణంలోని కూచిరాజ్‌పల్లి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని గుర్తించి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆవులతో పాటు పట్టుబడిన ఇద్దరినీ తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలి
- నిర్మాణ పనులను కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించిన కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి





వరంగల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న నూతన బస్‌స్టేషన్ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి గుండు సుధారాణి వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన నమూనా చిత్రపటాన్ని పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై నిర్మాణ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా బస్‌స్టేషన్ నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా నిర్మాణ వేగాన్ని పెంచాలని స్పష్టం చేశారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ నిర్మాణ పనుల కోసం అదనంగా కార్మికులను నియమించాలని సూచించారు. స్తంభాలు, పైకప్పు పలకలు, రక్షణ గోడ నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో కుడా కార్యనిర్వాహక ఇంజినీర్ భీమ్‌రావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ జలాలుద్దీన్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

- వేడుకల చిత్రాలు, దృశ్యాలతో విస్తృత ప్రచారం కల్పించాలి
- బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై అవగాహన కల్పించాలిపర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్





హనుమకొండ, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు.
మంగళవారం నిర్వహించిన వీడియో సమావేశంలో బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.
వాణీ ప్రసాద్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, వాహనాల నిలుపుదల, భద్రత వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను విస్తృతంగా సేకరించి ప్రచారం చేయాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.

బతుకమ్మ పాటలతో సూపర్ ఎల్‌నినోపై అవగాహన

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై పడే ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించి, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలను పాటల్లో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సందేశాత్మక పాటలు రూపొందించేందుకు మహిళా సంఘాలు, యువత, ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలకు వేదికగా మలచాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు వాణీ ప్రసాద్ తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు రెండు ప్రాజెక్టులను అప్పగించినట్లు వివరించారు. సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో పనులు చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతి, నిర్మాణ నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండు వారాల్లో డీపీఆర్‌ల తయారీ బాధ్యతలు

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రాజెక్టుల నివేదికల తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధి, భూమి లభ్యత, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, పనుల అమలు గడువు వంటి వివరాలను నివేదికల్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. అవసరమైన చోట నిపుణుల సంస్థల సహకారం తీసుకునేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

హరిత హోటళ్ల పూర్తికి ప్రైవేట్ పెట్టుబడులు

కొన్ని జిల్లాల్లో పాక్షికంగా పూర్తయిన హరిత హోటళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వాణీ ప్రసాద్ వెల్లడించారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో మిగిలిన పనులు పూర్తి చేసి, నిర్దిష్ట కాలానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఆసక్తి చూపే పెట్టుబడిదారులను జిల్లా స్థాయిలో గుర్తించి, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

పర్యాటక ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా నిధుల సమీకరణకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద జిల్లాకు అనువైన పర్యాటక ప్రాజెక్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, వాహనాల నిలుపుదల, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలని తెలిపారు.

పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది నియామకం

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వాణీ ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన చోట ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలని సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటకులకు సురక్షిత వాతావరణం కల్పించి, సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జి) శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను, ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్రజల భద్రతే లక్ష్యం.. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

- నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మహిళలు, చిన్నారులపై నేరాల విషయంలో నిర్లక్ష్యం వద
- పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాలు





భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, నేరాల నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లాలో నేరాల పరిస్థితి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కేసును బాధ్యతగా తీసుకొని బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. తీవ్రమైన, సాధారణ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. తప్పిపోయిన వ్యక్తుల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి ఆచూకీ గుర్తించేందుకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నేరాలు, కేసుల దర్యాప్తు పురోగతికి సంబంధించిన వివరాలను నేర, నేరస్థుల ట్రాకింగ్ వ్యవస్థ (సీసీటీఎన్ఎస్)లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామ స్థాయిలో పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీసు అధికారి విధుల్లో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు ఎ. సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారు గాయత్రీమాతగా దర్శనం

- మూడో రోజు శరన్నవరాత్రి ఉత్సవాల్లో సింహవాహన, గజవాహన సేవలు
- భక్తులను అలరించిన హరికథ, భక్తి సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు



వరంగల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం చంద్రఘంటా క్రమంలో సింహవాహన సేవ, సాయంత్రం మహిషమర్దిని దుర్గా క్రమంలో గజవాహన సేవ నిర్వహించారు. గాయత్రీమాతగా అమ్మవారిని దర్శించుకోవడం వల్ల మంత్రసిద్ధి కలుగుతుందని, సాధకులు చేసే జపం, విద్యాభ్యాసం సత్ఫలితాలను అందిస్తాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు వివరించారు. మంత్రదీక్ష సాధనలో కీలకమైనదని, సాధకుడికి అనుకూలమైన మంత్రాన్ని నిర్ణయించి దీక్షను అందిస్తారని తెలిపారు. చంద్రఘంటా రూపంలో అమ్మవారిని ఆరాధించడం వల్ల సాధకులను పీడించే దుష్టశక్తులు తొలగిపోతాయని, మహిషమర్దిని రూపంలో పూజించడం వల్ల అంతర్గత దుర్గుణాలు అణచివేయబడి సాధన నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

అమ్మవారి విశేష అలంకరణకు దొంతుల ప్రభాకర్‌రెడ్డి–అనిత దంపతులు, నామిరెడ్డి విక్రమ్‌రెడ్డి–చైతన్య దంపతులు, కరణం ఫణి ప్రసాద్–కాంచన దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం వారికి శేషవస్త్రాలు బహూకరించి, ప్రసాదాలు అందజేశారు. నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పర్యవేక్షించారు. భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మాడవీధులు, రథోత్సవ రథాన్ని పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం భద్రకాళీ దేవస్థానాన్ని సందర్శించి మాడవీధుల అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. దసరా నవరాత్రుల్లో నిర్వహించనున్న అమ్మవారి రథోత్సవానికి సంబంధించి రథాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా), నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు కుటుంబ సమేతంగా భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, వేద పండితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు నవరాత్రి విశేష హారతులను వీక్షించారు. అనంతరం మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు.

నూతన ఎస్ఐ భరత్‌కు సీనియర్ జర్నలిస్టు సత్కారం

- రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన చింతకింది కృష్ణమూర్తి



రఘునాథపల్లి, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎం. భరత్‌ను సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి చింతకింది కృష్ణమూర్తి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ భరత్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ భరత్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావచ్చని తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్ఐ భరత్ పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు కావాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి



మహబూబాబాద్/తొర్రూరు, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల మద్దతు పొందేందుకు సహకరించాలని ఆయన కోరారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఉద్యోగ నియామక ప్రకటనలు విడుదలయ్యేలా, నిరుద్యోగ భృతి అందేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలో మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనలు విడుదల కానున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేస్తామన్నారు. దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదుకు ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు కల్పించిందని, త్వరలో మరిన్ని నియామకాలకు ప్రకటనలు వెలువడనున్నాయని యశస్విని రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కోరిన కోర్కెలు తీర్చే స్వయంభు భద్రకాళి అమ్మవారు

- తొర్రూరులో అంగరంగ వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన
- మూడు జిల్లాల నుంచి అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు
- తొర్రూరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జూలూరి జగన్



మహబూబాబాద్/తొర్రూరు, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):తొర్రూరు పట్టణంలోని అన్నారం రోడ్డులో స్వయంభువుగా వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా భక్తుల పూజలు అందుకుంటున్నారని తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జూలూరి జగన్ అన్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, పురోహితుల మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరి జగన్ మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచే శ్రీ భద్రకాళి అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా విశిష్ట పూజలు అందుకుంటున్నారని తెలిపారు. తొర్రూరు ప్రాంత ప్రజలతో పాటు దాదాపు మూడు జిల్లాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా అమ్మవారు ఈ ప్రాంతంలో విశేష ఆదరణ పొందుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికత మనసుకు ప్రశాంతను, మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందని జగన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఓటరు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు

- ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ,అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా హనుమకొండ జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు మంగళవారం వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు, తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత తేదీల్లో తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి నిర్దేశిత నమూనా దరఖాస్తు (ఫారం–6) సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రత్యేక శిబిరాల సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండాలని, అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదన్నదే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాల కోసం తమ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారులను లేదా హనుమకొండ జిల్లా ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

కేయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డాక్టర్ పి. శ్రీనివాస్ నియామకం

- రెండేళ్ల పాటు బాధ్యతలు.. ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం



కాకతీయ విశ్వవిద్యాలయం, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగ నూతన అధిపతిగా డాక్టర్ పి. శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం రెండేళ్ల కాలానికి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విభాగాధిపతిగా కొనసాగుతున్న డాక్టర్ టి. శాస్త్రి నుంచి డాక్టర్ పి. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నియామకం పట్ల విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

అమరవేణి నర్సా గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన చంద్రన్న, ప్రజాసంఘాల నాయకులు

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిద్ధార్థ బహుజన్ గౌడ్‌కు నెల మాసికం



నిర్మల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమరవేణి సిద్ధార్థ బహుజన్ గౌడ్ నెల మాసిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్నతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. సిద్ధార్థ బహుజన్ గౌడ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన నాయకులు, ఆయన తల్లిదండ్రులు, అమరవేణి నర్సా గౌడ్, నిర్మలతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు గంట సత్యం, టీఏకేఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బంటు శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు పెద్ది రాజన్న, ఇంజనీర్ పోచన్న, తోట రాజు, లింగు ఎం., నర్సయ్య, ఏ. రాజేశ్వర్ తదితరులతో పాటు వివిధ ప్రజాసంఘాలు, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు.. ప్రకాష్ రెడ్డిపేట ప్రజలకు నరకయాతన!

- విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో దుర్భర పరిస్థితులు
- డ్రైనేజీ వ్యవస్థ లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు..
  వ్యాధుల భయంతో స్థానికుల ఆందోళన



హనుమకొండ, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోవడంతో ప్రకాష్ రెడ్డిపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమకొండలోని ప్రకాష్ రెడ్డిపేట విద్యుత్ ఉపకేంద్రం సమీప ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతుండటంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత కొంతకాలంగా ఈ సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీ లేక రోడ్డుపైకి మురుగునీరు

ప్రాంతంలో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు ప్రధాన రహదారిపైకి చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో రహదారిపై నిత్యం మురుగునీరు నిల్వ ఉంటూ దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుండగా, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటిలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోమల బెడద.. వ్యాధుల భయం

రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పారిశుధ్య సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ప్రాంతంలో మురుగునీటి పారుదలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిపై మురుగునీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

మంథనిలో అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

- గోదావరి పుష్కర ఘాట్ వద్ద 10 రోజుల్లోగా కాంక్రీటు పనులు ప్రారంభించాలి
- నాలుగు రోజుల్లోగా రహదారి నిర్మాణ నమూనాలు ఖరారు చేయాలి
- మార్చి 2027 నాటికి సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం పూర్తి చేయాలి



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం మంథని పట్టణంలో గోదావరి పుష్కర ఘాట్ వద్ద రహదారి నిర్మాణ పనులు, మంథని–రామగుండం రహదారిపై హెలిప్యాడ్ అభివృద్ధి పనులు, సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం, నూతన ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం రామగిరి మండలం పన్నూరు క్రాస్‌రోడ్డు వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.

పుష్కర ఘాట్ పనులకు గడువు

గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో 10 రోజుల్లోగా కాంక్రీటు పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారి నిర్మాణ నమూనాలను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు, పనులకు అడ్డుగా ఉన్న చెట్లు, పొదల తొలగింపును వేగవంతం చేయాలని తెలిపారు. పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను రెవెన్యూ డివిజన్ అధికారి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ వద్ద నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. రహదారి మధ్యలో విభజన గోడ ఏర్పాటు చేస్తూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మంథని–రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్‌ను పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్.. నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

మార్చి 2027 నాటికి సమీకృత కార్యాలయ భవనం పూర్తి

మంథనిలో నిర్మిస్తున్న సమీకృత డివిజన్ కార్యాలయాల భవన పనులను పరిశీలించిన కలెక్టర్.. 2027 మార్చి నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

మున్సిపల్ భవన పనులు వేగవంతం చేయాలి

మంథని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని సాధ్యమైనంత త్వరగా సిద్ధం చేయాలని సూచించారు.
ఈ పర్యటనలో రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ భావ్ సింగ్, రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన ఖాతాదారుడి కుటుంబానికి రూ.లక్ష బీమా పరిహారం

- గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చొరవ
- హనుమకొండలో బాధిత కుటుంబానికి పరిహార పత్రం అందజేత



హనుమకొండ, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుడు కుంటమల్ల గణేష్ కుటుంబానికి బ్యాంకు ప్రమాద బీమా కింద మంజూరైన రూ.లక్ష పరిహారాన్ని మంగళవారం అందజేశారు. హనుమకొండకు చెందిన గణేష్ కుటుంబ సభ్యురాలు, నామినీ కుంటమల్ల స్వప్నకు డీఆర్‌డీఓ మేన శ్రీను చేతుల మీదుగా పరిహార పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేన శ్రీను మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు అందించే ప్రమాద బీమా పథకాలు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు. గణేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఖాతాదారులకు సేవలందించడంతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు శాఖ నిర్వాహకుడు మ్యాదరి సందీప్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

- వేధింపులకు గురైతే భయపడొద్దు.. షీ టీమ్‌ను సంప్రదించండి
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం: పోలీసులు



పెద్దపల్లి జిల్లా / కమాన్‌పూర్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి);మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆదివరాహ మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎం. లావణ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మహిళల భద్రత, విద్యార్థినుల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో), సామాజిక మాధ్యమాల ప్రభావం, యుక్తవయసులో వచ్చే మార్పులు, విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. మహిళలపై వేధింపులు, అంతర్జాల మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి తెలియజేశారు. మహిళల భద్రత కోసం బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లను, అంతర్జాల మోసాలకు గురైతే 1930 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు టీ–సేఫ్ అనువర్తనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీలు చెలుకలపల్లి భిక్షపతి, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


అన్నపూర్ణా.. చంద్రఘంటా దేవిగా అమ్మవారి దివ్యదర్శనం

- పాలకుర్తిలో రాజశ్యామలా పీఠం ఆధ్వర్యంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



జనగామ జిల్లా/ పాలకుర్తి, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):జనగామ జిల్లా పాలకుర్తి పట్టణంలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో రాజశ్యామలా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ చంద్రఘంటాదేవి అలంకారాల్లో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పండితులు దేవగిరి సంతోష్ శివాచార్య, దేవగిరి శ్యామ్ శివాచార్యల పర్యవేక్షణలో ఉదయం నుంచే వివిధ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష స్నపనం, పంచామృతాభిషేకాలు సమర్పించారు. భక్తుల రుణబాధలు తొలగి, సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ లక్ష్మీ గణపతి హోమం, చండీ సప్తశతీ సామూహిక హోమాలను నిర్వహించారు.అనంతరం ప్రదోష సమయంలో అమ్మవారికి చతుఃషష్టి ఉపచార పూజలు నిర్వహించి, నీరాజనాలు, మంత్రపుష్పాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.అమ్మవారి దివ్య అలంకరణలు, వేదమంత్రోచ్చారణలు, హోమాలు, ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజశ్యామలా పీఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడి మధ్య కొనసాగుతున్నాయి.

గాయత్రీమాతగా భద్రకాళీ అమ్మవారి దర్శనం



హనుమకొండ / భద్రకాళీ ఆలయం , అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారిని గాయత్రీమాతగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం చంద్రఘంటా క్రమంలో సింహవాహన సేవ, సాయంత్రం మహిషమర్దిని దుర్గా క్రమంలో గజవాహన సేవ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రీ మాత సమస్త మంత్రాలకు స్వరూపమని, అమ్మవారిని ఆరాధించడం వల్ల మంత్రసిద్ధితో పాటు విద్యాభ్యాసంలో ఏకాగ్రత, విజయం లభిస్తాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించారు. చంద్రఘంటా రూపంలో అమ్మవారిని సేవించడం వల్ల సాధకులను బాధించే ప్రతికూల శక్తులు తొలగిపోతాయని, మహిషమర్దిని రూపంలో ఆరాధించడం వల్ల మనిషిలోని దురహంకారం, బద్ధకం తొలగి ఆధ్యాత్మిక సాధనకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. అమ్మవారి విశేష అలంకరణకు దొంతుల ప్రభాకర్ రెడ్డి–అనిత, నామిరెడ్డి విక్రమ్ రెడ్డి–చైతన్య, కరణం ఫణిప్రసాద్–కాంచన దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం వారికి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు. భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాడవీధులు, రథోత్సవ ఏర్పాట్ల పరిశీలన

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ భద్రకాళీ ఆలయాన్ని సందర్శించి మాడవీధుల అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో నిర్వహించనున్న అమ్మవారి రథోత్సవానికి సంబంధించి రథాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు కుటుంబ సమేతంగా భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నవరాత్రి విశేష హారతులను వీక్షించారు. ఆలయ అర్చకులు మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్థలాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఎలా ఉంటాయి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పాకనాటి దామోదర్‌రెడ్డి సూటి ప్రశ్న
- ప్రభుత్వ భూముల వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



జనగామ జిల్లా/ పాలకుర్తి, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్థలాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఎలా ఉంటాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాకనాటి దామోదర్‌రెడ్డి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ప్రశ్నించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన వ్యవహారంపై ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఒక్క ఎకరం భూమిని ఆక్రమించినట్లు నిరూపితమైనా రాజకీయ సన్యాసం తీసుకుంటానని గతంలో ప్రకటించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రస్తుతం వస్తున్న ఆరోపణలపై సమాధానం చెప్పాలని దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూడు మండలాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని పేర్కొన్నారు.సంబంధిత ఇళ్ల స్థలాల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచలేదని ఆరోపించిన ఆయన, భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన చట్టాల ప్రకారం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన దామోదర్‌రెడ్డి, పాలకుర్తి చౌరస్తాకు వచ్చి చర్చించాలని ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సవాల్ విసిరారు.ఈ సమావేశంలో బీజేపీ పాలకుర్తి మండల అధ్యక్షుడు మారం రవికుమార్, దొంగరి మహేందర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవి, కమ్మగాని శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు పబ్బ సంతోష్, మామిండ్ల వెంకన్న, మచ్చ సునీల్, కాసోజు సమ్మయ్య చారి, సునావత్ శంకర్ నాయక్, దేవసాని కృపాకర్, కృష్ణారెడ్డి, రావుల అనిల్, బొచ్చు సురేష్, చిక్కుడు అశోక్, మొగిలి వంశీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వేరుశెనగ విత్తన ఉత్పత్తిపై రైతులకు అవగాహన

- ముమ్మిడివారంలో శ్రీ లక్ష్మి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో సదస్సు



వరంగల్/ సంగెం, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): రైతులు నాణ్యమైన వేరుశెనగ విత్తనాలను ఉత్పత్తి చేసి వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించేలా అవగాహన కల్పించేందుకు సంగెం మండలం ముమ్మిడివారం గ్రామంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. శ్రీ లక్షి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విత్తన ఉత్పత్తి విధానాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతపై అధికారులు రైతులకు వివరించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా టీజీఎస్ఏసీడీసీ వరంగల్ ప్రాంతీయ నిర్వాహకుడు రఘు, సంగెం మండల వ్యవసాయ అధికారి జగదీష్, మొండ్రాయి వ్యవసాయ విస్తరణ అధికారి రాజేందర్ హాజరయ్యారు. వేరుశెనగ విత్తనాల ఉత్పత్తిలో పాటించాల్సిన పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు, సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.రైతులకు విత్తన ఉత్పత్తిపై అవగాహన పెంపొందించి, వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడటమే సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకొని నాణ్యమైన విత్తనాల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీ లక్షి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకన్న, లెక్కల నిర్వాహకుడు వీరస్వామి, సంస్థ సంచాలకులు, గ్రామ రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నిరుద్యోగుల సమస్యల పరిష్కరిస్తా.

: జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడాల శ్రీనివాసరావు.



నిత్యం నిఘా, ఏన్కూర్, అక్టోబర్ 13 : గత 20 సంవత్సరాలుగా చేసిన సేవలు, కోవిడ్ సమయంలో హెల్త్ డైరెక్ట్ గా అందించిన సేవలే ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తాయని జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడాల శ్రీనివాసరావు అన్నారు. ఏన్కూరు మండల కేంద్రంలోని ఆవుల నర్సయ్య నివాసంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సందర్భంగా గడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ..... కోవిడ్ సమయంలో తాను అనేక సేవలు చేసి ప్రజల మన్ననల పొందానని , అదేవిధంగా నిరుద్యోగ సమస్యల కోసం జనసేన పార్టీ తాను ఎప్పుడు ముందే ఉంటానని ఆయన అన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు జనసేన పార్టీ వైపుకే ఆసక్తి కనబరుస్తున్నారు అని పేర్కొన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ లో తనకు మొదటి ప్రాధాన్యతనిస్తూ గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆవుల నరసయ్య , పిన్ని వెంకట నర్సయ్య , ఆది వెంకటేశ్వర్లు, ముదిగొండ నాగేశ్వర రావు, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- **పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్పాల్....**



నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 13 : అర్బన్ నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.నగరంలోని 50,7,20వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నార న్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయ డ ం జ రుగుతుంద న్నారు. అ ర్బన్ చాలెంజ్ ఫండ్ కోసం కూడా ఇప్పటికి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాన న్నారు.తొందర్లోనే డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుంద న్నారు.అలాగే డివిజన్కు కోటి రూపాయల పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమ య్యాయని,మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు.అమృత్ 2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.అయితే పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని,ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచించడం జరిగిందన్నారు.ప్రధానంగా నగరంలో నూతనంగా 9 వాటర్ ట్యాంకుల నిర్మాణం జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నీటి ఎద్దడి లేకుండా పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర గల అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుంద న్నారు.ఇటీవల ఇందుకు సంబంధించిన అధికారులు,కంపెనీ ప్రతినిధులు సందర్శించారని గుర్తు చేశారు.కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి,50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి,7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్,20వ డివిజన కార్పొరేటర్ న్యాలం సునీత,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాత రూపాయి నోటు పేరుతో భారీ మోసం..
రూ.70 కోట్ల సైబర్ లావాదేవీలు

ములుగు జిల్లా/ తాడ్వాయి, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి):పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు చెల్లిస్తామన్న ఆకర్షణీయమైన ఆఫర్ వెనుక భారీ సైబర్ నేరాల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ కేసు విచారణలో దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 450 సైబర్ నేరాల కేసులతో సంబంధాలున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నెట్‌వర్క్ ద్వారా రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అయితే, ఈ లావాదేవీలన్నీ నిందితులే నేరుగా చేశారా? ఎంత మొత్తం బాధితుల నుంచి కాజేశారు? అనే అంశాలు పూర్తిస్థాయి విచారణలో తేలాల్సి ఉంది.

సైబర్ నేరగాళ్లు తమ అక్రమ కార్యకలాపాలకు ఇతరుల బ్యాంకు ఖాతాలను వినియోగించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మోసాల ద్వారా వచ్చిన డబ్బును పలు ఖాతాల ద్వారా దశలవారీగా బదిలీ చేసేందుకు ఇలాంటి ఖాతాలను ఉపయోగిస్తుంటారు. వీటిని 'మ్యూల్ ఖాతాలు'గా పిలుస్తారు. ఈ పద్ధతి ద్వారా అసలు నేరగాళ్లను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు సవాలుగా మారుతోంది. ఈ వ్యవహారంలోనూ నిందితులు సేకరించిన బ్యాంకు ఖాతాలను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.

ఆశ చూపించి ఖాతాల సేకరణ?

పాత నోట్లు, అరుదైన నాణేలకు లక్షల రూపాయలు చెల్లిస్తామంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేస్తుంటారు. ఇలాంటి ప్రకటనలను నమ్మిన వారిని లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడే అవకాశాలున్నాయి. ఈ కేసులోనూ పాత రూపాయి నోటుకు భారీ మొత్తం ఇస్తామన్న ఆఫర్ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన వ్యవహారం సైబర్ నేరాల నెట్‌వర్క్‌తో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెట్‌వర్క్‌లో మరికొందరి పాత్ర ఉందా? ఇతర ప్రాంతాల్లోనూ ఇదే విధంగా బ్యాంకు ఖాతాలను సేకరించారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

పాత నోటుకు భారీ ధర ఇస్తామంటూ ముందుగా నమోదు రుసుము, పన్నులు, ధ్రువీకరణ ఖర్చులు లేదా ఇతర పేర్లతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలి.



అరుదైన నోట్లు, నాణేలకు సంబంధించి వచ్చే ప్రకటనలను పూర్తిగా నిర్ధారించుకోకుండా ఎలాంటి చెల్లింపులూ చేయకూడదు. అలాగే కమీషన్ల ఆశతో ఇతరులకు తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను అప్పగించకూడదు. తమ ఖాతాలను ఇతరులు వినియోగించుకునేందుకు అనుమతిస్తే, వాటి ద్వారా జరిగే అక్రమ లావాదేవీలపై ఖాతాదారులు సైతం విచారణను ఎదుర్కోవాల్సి రావచ్చు.

ఆకర్షణీయమైన ఆఫర్లకు ఆశపడి మోసపోవద్దనీ, ఆన్‌లైన్‌లో డబ్బులు పంపే ముందు ఆఫర్ నిజమైనదో కాదో నిర్ధారించుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు ఇస్తామన్న ప్రచారం వెనుక ఉన్న పూర్తి వాస్తవాలు, సైబర్ నేరాల నెట్‌వర్క్‌లోని వ్యక్తుల పాత్రపై దర్యాప్తు పూర్తయితే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

హంగర్గ పంచాయతీలో నిధుల లెక్కలపై దుమారం

నిజామాబాద్ జిల్లా / పోతంగల్, అక్టోబర్ 13 (నిత్యం నిఘా ప్రతినిధి): పోతంగల్ మండలం హంగర్గ గ్రామ పంచాయతీలో నిధుల వినియోగంపై వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంచాయతీ నిధుల దుర్వినియోగం, పాలకవర్గ తీర్మానాలను పట్టించుకోకపోవడం, పన్నుల వసూళ్లలో అక్రమాలు జరిగాయంటూ కార్యదర్శి గంగారాంపై సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం కార్యదర్శిని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి, కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు వచ్చి స్పష్టత ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీరడి ఉదయ్ భాస్కర్, ఉపసర్పంచ్ డి.గోపాల్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామసభల్లో జమా ఖర్చుల వివరాలు అడిగితే కార్యదర్శి సరైన సమాధానాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. రశీదులు ఇవ్వకుండా ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని, ఇంటి నంబర్లలో పేరు మార్పిడి కోసం బిల్లులు లేకుండానే పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారని విమర్శించారు. పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండానే ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు కేటాయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

పన్నుల వసూళ్లలోనూ అక్రమాల ఆరోపణలు

పంచాయతీ రశీదు పుస్తకాల్లో ఖాళీలు వదిలి నిధుల లెక్కల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపించారు. వసూలైన పన్నుల్లో సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నారని ఆరోపించారు. జనవరి నెలలో ఎన్నికల ఖర్చుల పేరిట రూ.39 వేలు, రూ.24 వేలు, రూ.20 వేలు, ఎంబీ నమోదు కోసం రూ.32 వేలు చూపించడంపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



రికార్డులు స్వాధీనం.. విచారణకు డిమాండ్

గ్రామంలో ఆందోళన తీవ్రం కావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. మండల స్థాయి అధికారులు శిక్షణలో ఉండటంతో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులను అక్కడికి పంపించారు. అనంతరం సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ సింధె షాజీ పాటిల్, ఉపసర్పంచ్ డి.గోపాల్, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చలు జరిపారు. వారి సమక్షంలో కార్యదర్శి వద్ద ఉన్న గ్రామ పంచాయతీ రికార్డులు, లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ నిధుల వినియోగం, పన్నుల వసూళ్లు, ఖర్చుల వివరాలపై డివిజనల్ పంచాయతీ అధికారి ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని పాలకవర్గం, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆరోపణల్లో వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వాకింగ్ ట్రాక్..
ఓపెన్ జిమ్‌గా అభివృద్ధి చేయాలని కాలనీవాసుల విజ్ఞప్తి



నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 13 : వికారాబాద్: పట్టణంలోని 31వ వార్డు, కే. రాజయ్య ఇంటి వెనుక ఉన్న వాకింగ్ ట్రాక్ అసంపూర్తిగా మిగిలిపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. సరైన నిర్వహణ లేక గడ్డి, పెద్దపెద్ద చెట్లతో నిండిపోయి పాముల సంచారానికి నిలయంగా మారింది. అంతేకాకుండా ఈ ప్రాంతం మద్యం సేవించే వారికి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వాకింగ్ ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, శుభ్రపరిచి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే కాలనీవాసులకు ఆరోగ్యపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, పాముల బెడదను నివారించి, పరిసరాల్లో భద్రత కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హక్కుల కోసం సమరశంఖం..
ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- **వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన ఉద్యోగులు**
- **ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణే ప్రధాన డిమాండ్లు**
- **రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది ఉద్యోగుల సమ్మె**



నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 13 : ఉద్యోగాల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, వేతన సమస్యల పరిష్కారం కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు.గత ఏడాది కాలంగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రభుత్వ అధికారులను కలిసి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఆశించిన ఫలితం లభించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరవధిక సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రజారోగ్య పరిరక్షణలో ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారం చూపాలని కోరారు. తమ పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదని, ఉద్యోగుల హక్కుల సాధన కోసమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని ఎన్‌హెచ్‌ఎం ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com